## క్లుప్తంగా

### బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన పలువురు శనివారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అమ్ముల రాంబాబుతో పాటు పలువురు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో వారు పార్టీలో చేరారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి పోచారంను గెలిపించాలని కోరారు.

### కొనుగోలు కేంద్రం ప్రారంభం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం రాఘవపూర్‌లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వాజీద్ మాట్లాడుతూ దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు.

### ఆర్థిక సహాయం

బీబీపేట: మండలంలోని ఉప్పర్‌పల్లికి సందరి భుదవ్వ అనారోగ్యంతో మృతి చెందగా.. అంత్యక్రియల కోసం ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుభాష్‌రెడ్డి తరఫున రూ.5 వేలు, బీఆర్ఎస్ పార్టీ నుంచి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజంపేట: మహిళా సంఘ సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. శనివారం మండంలలోని బస్వన్నపల్లిలో మహిళా సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యదర్శి లలిత, కోశాధికారి లావణ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు రాధ, సీసీ సాయిలు పాల్గొన్నారు.

### పాశుపత రుద్రయాగం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని కల్కినగర్‌లో గల కోటిలింగేశ్వర అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అర్చకుడు మశ్చేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పాశుపత రుద్రయాగం నిర్వహించారు. అంతకుముందు కోటిలింగేశ్వర స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. దొడ్లె మల్లేష్, నవీన్, కుమ్మరి అనిల్ పాల్గొన్నారు.

### హనుమాన్ చాలీసా పారాయణం



కామారెడ్డి అర్బన్: అధ్యాత్మిక భావన, హిందువుల ఐక్యతలో భాగంగా ప్రతి శనివారం స్థానిక గంజ్ వర్తక సంఘం శ్రీహనుమాన్ ఆలయంలో సామూహిక శ్రీహన్‌మాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి యెల్లంకి సుదర్శన్ అన్నారు. శనివారం ఉదయం 8గంటల నుంచి అరగంట పాటు సామూహిక హన్‌మాన్ చాలీసా పారాయణం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఆటో ఎక్కిన 'ఏనుగు'



మద్నూర్: ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు నాయకులు దొరికిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల సీజన్ మొదలు కావడంతో అభ్యర్థులు ప్రచారాలు ప్రారంభించారు. బహుజన్ సమాజ్ పార్టీకి ఏనుగు గుర్తు ఉండడంతో బీఎస్పీ అభ్యర్థి ఏనుగు బొమ్మను తయారు చేయించి, ఆటోపై పెట్టి ప్రచారం చేయిస్తున్నారు. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

# అర్హులకు పథకాలు అందడం లేదు

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్





చందాపూర్‌లో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు, వృద్ధుడితో మాట్లాడుతూ..

తాడ్వాయి : బీఆర్ఎస్ ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు అన్నారు. తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి, దేవాయిపల్లి, బ్రహ్మాజీవాడి, బ్రాహ్మణపల్లి, చందాపూర్, ఎర్రాపహాడ్, కాలోజీ వాడి, సంగోజీవాడి తదితర గ్రామాలలో శనివారం ఆయన ప్రచారం చేశారు. ప్రతి గ్రామంలో ఆయనకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు చందాలు వేసుకొని జాజాల సురేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వారిని కలవడం లేదన్నారు. ప్రజలకు ఎలాంటి సేవలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ వైఫల్యాలను వివరించారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో తాను చదువుకున్నట్లు గుర్తు చేసుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తిరిగి కష్టసుఖాలు తెలుసుకొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. కరోనా సమయంలో వైద్య సేవలు అందించి వందలాది మంది ప్రాణాలను కాపాడనని, జాబ్‌మేళాలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు ఇప్పించానని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే యూసుఫ్‌అలీ పాల్గొన్నారు.

## ఉద్యమ ద్రోహులను పక్కన పెట్టుకున్న కేసీఆర్

- కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి



నెమ్లి ఆలయంలో పూజలు చేస్తున్న రవీందర్‌రెడ్డి

బాన్సువాడ : తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులను పక్కకు నెట్టేసి ఉద్యమ ద్రోహులను సీఎం కేసీఆర్ పక్కన పెట్టుకున్నారని కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత తప్ప ఏ ఒక్క నాయకుడిని ప్రచారం చేయనియ్యారని ఆరోపించారు. ప్రగతి భవన్‌లో ఎమ్మెల్యేలకు, సామాన్యులకు ప్రవేశం లేకుండా సీఎం కేసీఆర్ రాచరిక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. తాను కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఎల్లారెడ్డి అసెంబ్లీ, లేదా జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని కోరితే అధిష్టానం తనను బాన్సువాడలో పోటీ చేయాలని చెప్పడంతో ఇక్కడి వచ్చానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బాన్సువాడలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లుగా కాంగ్రెస్ కోసం అహర్నిశలు కృషి చేసిన కాసుల బాల్‌రాజ్‌ను కలుపుకుని ముందుకు వెళ్తానని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసిన వ్యక్తి కాసుల బాల్‌రాజ్ అన్నారు. కార్యకర్తలకు నిత్యం అండగా నిలిచిన కాసులకు అధిష్టానం మంచి స్థానం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు వెంకట్‌రాంరెడ్డి, కుసీపూర్ రాజిరెడ్డి, సోమశేఖర్‌రావు, కమలాకర్‌రెడ్డి, యలమంచలి శ్రీనివాస్‌రావు, నందకిశోర్‌రెడ్డి, మాసాని రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, అనిల్‌రెడ్డి, అరెగె సాయిలు, సత్యనారాయణరెడ్డి, అన్వర్ ఉన్నారు.

నస్రుల్లాబాద్ : మండలంలోని నెమ్లిలో గల శ్రీ షిర్డి సాయి ఆలయంలో శనివారం ఏనుగు రవీందర్‌రెడ్డి పూజలు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నందు రెడ్డి, ప్రతాప్, అరిగె సాయిలు, భాస్కర్ గౌడ్ ఉన్నారు.

## అవకాశం ఇస్తే.. అభివృద్ధి చేస్తా

- జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతార



మహిళలతో మాట్లాడుతున్న అరుణతార

నిజాంసాగర్ : బీజేపీకి ఓట్లు వేసి తనను అసెంబ్లీకి పంపిస్తే జుక్కల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి అరుణతార అన్నారు. శనివారం నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, వెల్గనూర్, బ్రహ్మణపల్లి, ఆరేడ్ గ్రామాల్లో ఆమె ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ తాను ఒక్కసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు తప్పా ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే చేసిందేమి లేదన్నారు. రాములుసేట్, నరేశ్, రౌతురాజు, రాజాగౌడ్ ఉన్నారు.

## అబుల్ కలాం జయంతి



ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డిలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం మౌలా నా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అబుల్ క లాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉప న్యాస పోటీలను నిర్వహించి వారికి బహుమతులను అందించారు.

**కామారెడ్డిలో..**

కామారెడ్డి అర్బన్ : దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా శనివారం కామారెడ్డి తెలంగాణ మైనారిటీ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.



## ఎల్లారెడ్డిలో ఎగిరేది బీజేపీ జెండానే..



లక్ష్మాపూర్‌లో రైతులతో కలిసి ధాన్యం ఎగబోస్తున్న సుభాష్‌రెడ్డి

- బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎగిరేది బీజేపీ జెండా అని బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాన్కంపల్లి, కొట్టాల్, లక్ష్మాపూర్, అడివిలింగాల, హాజీపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. వైస్ ఎంపీపీ నర్సింలు, పరంధాములు, జనార్దన్‌రెడ్డి, ఎస్ఎన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

**బీజేపీలో చేరిక**

లింగంపేట : మండలంలోని అయిలాపూర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన పలువురు మహిళలు శనివారం సుభాష్‌రెడ్డి కుమారుడు దినేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన మహిళలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు దత్తురాములు, రాంచందర్, సాయన్న, చందు, ముకుందరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



వెల్లుట్లలో ప్రచారం చేస్తున్న విద్యారాణి

**సుభాష్‌రెడ్డి సతీమణి ప్రచారం**

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లలో బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి సతీమణి విద్యారాణి శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతు మహిళలకు బొట్టుపెట్టి సుభాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

## దేశానికి ఆదర్శంగా కేసీఆర్ పాలన



గిరిజనతండాల్లో ప్రచారం చేస్తున్న హన్మంత్‌సింధే



సింధేకు తిలకం దిద్దుతున్న మహిళలు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే

నిజాంసాగర్ : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ అభ్యర్థి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. జుక్కల్ మండలంలోని సవర్‌గాం తండా, వజ్రకండి, పోచారం, సోపూర్, మధుర తండాల్లో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. సమైక్య పాలనలో కరెంట్, ఎరువుల బస్తాలు, విత్తనాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్ ఇస్తూ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచారన్నారు. రైతులతో పాటు మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు గంటల కరెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడు గంటల కరెంట్ కూడా ఇవ్వరన్నారు. నాయకులు నీలుపటేల్, శివానంద్‌పటేల్, బానుగౌడ్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో పలువురి చేరిక**

నిజాంసాగర్/పిట్లం: జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, పిట్లం, నిజాంసాగర్ మండలాలకు చెందిన పలువురు యువకులు, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు హన్మంత్‌సింధే సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు విజయ్, సాయిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## దోచుకోవడం, దాచుకోవడం కాంగ్రెస్ నైజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి : దోచుకోవడం, దాచుకోవడం కాంగ్రెస్ పార్టీ నైజమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని బీసీ డిక్లరేషన్ నేడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో బీసీలకు న్యాయం లేదన్నారు. బీసీలకు సరిపడా టికెట్లు ఇవ్వకుండా డిక్లరేషన్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకున్న వ్యక్తి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో ఒక్క టికెట్ కూడా బీసీలకు ఇవ్వలేదన్నారు. కామారెడ్డిలో పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డికి డిపాజిట్ కూడా రాదన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కాశీనారాయణ, సొసైటీ చైర్మన్ నర్సింలు, సతీష్, ఇమ్రాన్ ఉన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిక**

సదాశివనగర్ : మండలంలోని వజ్జపల్లి తండాకు చెందిన ఉప సర్పంచ్ స్రవంతి దేవిసింగ్ బీజేపీ నుంచి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఉపసర్పంచ్‌తో పాటు 50మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలం భిక్కనూర్‌కు చెందిన పలువురు శనివారం ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ప్రజాస్వామ్య పాలన అందిస్తాం

- బాన్సువాడ బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ



దేశాయిపేట్‌లో మాట్లాడుతున్న యెండల

బాన్సువాడ రూరల్: కుటుంబ పాలనకు స్వస్తి పలికి ప్రజాస్వామ్య పాలన అందించేందుకు ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని బాన్సువాడ బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ కోరారు. శనివారం ఆయన మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్, పోచారం, రాంపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుటుంబ పాలనలో నలిగిపోయిన బాన్సువాడ ప్రజలకు స్వేచ్ఛ కల్పించేందుకే తాను పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కమలం పువ్వుగుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. గూగ్లోత్ సుగుణ, దొరబాబు, భూపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, చీదుర సాయిలు, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, దాకయ్య, హన్మాండ్లు, శ్రీనివాస్, రాజాసింగ్, శ్రీధర్ సక్సేనా పాల్గొన్నారు.

**బీజేపీ గెలుపు ఖాయం**

నస్రుల్లాబాద్ : బాన్సువాడలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ బాన్సువాడ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. బెదిరింపులు, కబ్జాల పాలనకు అంతం బీజేపీతోనే సాధ్యమన్నారు. మండలంలోని హాజీపూర్, అంకోల్, అంకోల్ తాండా, బస్వాయిపల్లి, దుర్కి, సంగం గ్రామాల్లో ఆయన రోడ్ షో నిర్వహించారు. సున్నం సాయిలు, మేకల రాము, హన్మండ్లు యాదవ్, శ్రీకాంత్, ఉన్నారు.

## ఇంటింటా ప్రచారం..

**కేసీఆర్‌ను గెలిపించాలి**



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలోని 10, 12, 35వ వార్డుల్లో శనివారం సీఎం కేసీఆర్‌కు మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, కౌన్సిలర్లు ప్రచారం నిర్వహించారు. కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు. కౌన్సిలర్లు ఉరుదొండ వనిత, సుగుణ, కాసర్ల గోదావరి స్వామి, పోలీస్‌క్రిష్ణాజీరావు, నిట్టు వెంకట్‌రావు, ఉరుదొండ నరేష్, నాగల్ల రాజేందర్, లద్దూరి లక్ష్మీపతియాదవ్, నిట్టు నారాయణరావు, నిట్టు లింగారావు, ప్రవీన్, కాసర్ల రవీందర్, కొండ భైరయ్య, గండాల రవి, లారా పాల్గొన్నారు.

**కామారెడ్డి పట్టణంలో..**

కామారెడ్డి టౌన్ : కామారెడ్డిలోని ఆయా వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్‌లు శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పథకాలను ఓటర్లకు వివరించారు. కౌన్సిలర్‌లు గెరికంటి స్వప్న, కన్నయ్య, పిట్ల వేణుగోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**అభివృద్ధిని చూసి ఓటు వేయండి**



నస్రుల్లాబాద్ : బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పెర్క శ్రీనివాస్ కోరారు. శనివారం మండలంలోని మైలారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ ఓండ్ల యశోద, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మహేందర్, భాస్కర్ ఉన్నారు.

**సేవ చేసే వారిని ఆదరించాలి**



బాన్సువాడ : నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలందించే వారినే ఆదరించాలని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీరామ కాలనీ, శాంతినగర్, బేతాళస్వామి కాలనీల్లో ఆయన ప్రచారం చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వార్డు కౌన్సిలర్ కిరణ్, గురువినయ్, వాహబ్, వనం గంగాధర్, అందేరాజు, నార్ల ఉదయ్, విఠల్‌రెడ్డి, గంట్యాల బాలకృష్ణ, భవాని ప్రసాద్ ఉన్నారు.

**కేసీఆర్ గెలుపే లక్ష్యంగా..**

బీబీపేట : కామారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ గెలుపే లక్ష్యంగా శనివారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రచారం చేశారు. కేసీఆర్ గెలిచిన తర్వాత మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలకు వివరించారు. మీసాల సత్తయ్య, తోడేటి శ్రీను, ఎల్లం, సగ్గిల నర్సింలు పాల్గొన్నారు.

**లింగంపేట మండలంలో..**

లింగంపేట: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి, మాలపాటి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు శనివారం ప్రచారం చేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే సురేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ అనిల్‌రెడ్డి, నర్సింలు, రాజయ్య ఉన్నారు.

**తాడ్వాయి మండలంలో..**

తాడ్వాయి : తాడ్వాయి మండలంలోని గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సదాశివనగర్ మండలంలో..**

సదాశివనగర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రధాన పార్టీల నాయకులు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. శనివారం గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఇంటింట ప్రచారం నిర్వహించారు.

భిక్కనూరు: మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు కార్యకర్తలు శనివారం విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ తమ పార్టీ అభ్యర్థులకు ఓటేయ్యమని కోరారు.

**తాడ్కోల్‌లో..**



బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్‌లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేపట్టారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్ కుమ్మరి రాజమణి, గోపాల్‌రెడ్డి, కుమ్మరి రాజు, రాజు, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

**గజ్యానాయక్ తండాలో..**



మాచారెడ్డి: సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను చూసి ఓటేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాల్‌చంద్రం అన్నారు. శనివారం మండలంలోని గజ్యా నాయక్ తండాలో ఆయన ప్రచారం చేశారు. సర్పంచ్ హంజినాయక్, అబ్దుల్ ఖాన్, శ్రీధర్ రావు, భాస్కర్ ఉన్నారు.

**బీజేపీని ఆశీర్వదించండి**



మద్నూర్: తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే ప్రజలు బీజేపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో శనివారం ప్రచారం నిర్వహించి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. యాదవ్‌రావ్, తుల సంతు, తుకారం, హన్మండ్లు, కృష్ణ ఉన్నారు.

**కాషాయ జెండా ఎగరడం ఖాయం**



బీబీపేట: రాష్ట్రంలో ఈ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని నాయకులు అన్నారు. కామారెడ్డి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డిని గెలిపించాలని శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. పోసు శివకుమార్, రంజిత్‌గౌడ్, హరీష్, సురేష్, మహేష్, బాలు, సాయి, నారాయణ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలిస్తే రుణమాఫీ



తిమ్మానగర్‌లో ప్రచారం చేస్తున్న లక్ష్మీకాంత్‌రావు

పిట్లం : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంత్‌రావు పేర్కొన్నారు. ఆయన శనివారం మండలంలోని హస్నపూర్, తిమ్మానగర్, ఖంబాపూర్, కారేగాం, గొద్మేగాం, ధర్మారం, బ్రాహ్మణపల్లి, కిష్టాపూర్, నాగంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించిన గ్రామాల్లో తాము ప్రచారం చేయమని.. కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' కట్టించిన గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయొద్దని సవాలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే జుక్కల్ నియోజకవర్గాన్ని విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి చేసి చూపెడుతానన్నారు. ఈ సందర్భంగా ధర్మా రం, గొద్మెగాం గ్రామాల్లో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు రాంరెడ్డి, జంబిగే హన్మండ్లు, బోడ్ల రాజు, షేక్ నజీర్, సురత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మోయిన్, శివ, ఇమ్రోజ్, శ్రీధర్, శేఖర్, వెంకట్‌రెడ్డి, అంబరెడ్డి, మొగలాగౌడ్, మల్లప్ప పాల్గొన్నారు.